నేటి దినపత్రిక
# సూర్య
కర్నూలు | నంద్యాల
శనివారం | 17 ఫిబ్రవరి 2024 | పేజీలు 8

## సర్వదేవాత్మకుడు ఆదిత్యుడే

- సూర్యోపాసనతో సర్వశక్తిమంతులమవుదాం
- డాక్టర్ మల్లు వెంకటరెడ్డి
- క్రీడో పాఠశాలలో ఘనంగా రథసప్తమి వేడుకలు


సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ప్రతిరోజూ సూర్యోపాసన, సూర్య నమస్కారాల వల్ల విద్యార్థుల్లో తేజస్సు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడంతోపాటు మానసిక, శారీరక రుగ్మతల నుంచి విముక్తి కలుగుతుందని తిరుమ తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వహకులు డాక్టర్ మల్లు మిగతా 2లో


మహాకుంభాభిషేకం కోసం చేసిన ఏర్పాట్లు

### శ్రీశైలంలో శాస్త్రోక్తంగా
# మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభం

- ఈనెల 21న మహా కుంభాభిషేకం
- చివరిరోజు శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్టాపన, కుంభాభిషేకం
- మహోత్సవాల్లో పాల్గొన్న శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టా దశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల మహా క్షేత్రంలో ఎన్నో అవరోధాల నడుమ ఎట్టకేలకు మహా కుంభాభిషేకం మహో త్సవం ప్రారంభమైంది. ప్రధానాలయంలో మిగతా 2లో



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

### వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై
# ప్రజాపోరుకు సిద్ధం

- ప్రజాపోరు యాత్రకు కర్నూలు నుంచే లాంఛనంగా ప్రకటన
- వైసీపీ పాలనలో దోపిడీ, బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తాం
- వైసీపీ నేతలను జగన్ చెల్లని రూపాయలుగా భావిస్తున్నారు
- తెలంగాణలో పార్టీ జెండా పీకేసీ అద్దెకు వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- ప్రత్యేక హోదా అనేది లేదు
- ఇంకా ప్రజలను మోసం చేయవద్దు
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో పోటీకి సిద్ధం
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రజాపోరు స్టేట్ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ ప్రజాపోరు చేయడానికి సిద్ధంగా ఉందని, ఈ ప్రజాపోరు యాత్ర ప్రకటనను కర్నూలులోనే లాంఛనంగా మిగతా 2లో


పరిశీలిస్తున్న కలెక్టర్

### డిస్పాచ్ సెంటర్లను
# జిల్లా కలెక్టర్ పరిశీలన

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన పరిశీలించారు. శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కోడుమూరు, కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి డిస్పాచ్ సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొట్టమొదటిగా ఏ సెక్టార్ పోలింగ్‌కేంద్రం దూరంగా ఉంటుందో అటువంటి కేంద్రాలకు ప్రాధాన్యత క్రమంలో పోలింగ్ సామాగ్రిని అందించి పంపించే విధంగా చర్యలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సామాగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టిన తర్వాత ఎవరూ ప్రవేశించకుండా సీలింగ్ చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మిగతా 2లో

- స్వర్ణ రథాన్ని విరాళంగా సమర్పించిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
- వైభవంగా స్వర్ణరథ సమర్పణ మహోత్సవం

### శ్రీశైల మల్లన్నకు
# స్వర్ణరథం



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు శ్రీశైల మల్లికార్జున స్వామికి స్వర్ణ రథం తయారు చేయించారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం దీనిని మల్ల న్నకు కానుకగా సమర్పించారు. 23.6 ఆడుగుల ఎత్తుతో స్వర్ణ తాపడం చేయించిన ఈ రథం మధ్యలో పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కుమారస్వామి మూర్తులు కొలువుదీరాయి. స్వామి,అమ్మవార్ల చుట్టూ అష్టది క్పాలకులు, ముందుభా రెండు పెద్ద అశ్వాలు స్వారీ చేస్తున్నట్లు తీర్చిదిద్దారు. 8 నందులు, వినాయకుడు, మూర్తి, విష్ణు, దుర్గ, లింగో ద్భవ శివుడి మూర్తులు కనువిందు చేస్తున్నాయి. శ్రీశైలం దేవస్థానా నికి తొలి సారిగా స్వర్ణరథం సమకూరింది. ఇప్పటి వరకు స్వామి, అమ్మవార్లకు వెండిరథంపైనే ఊరేగిస్తున్నారు. దాతలు శుక్రవారం ఈ రథాన్ని దేవస్థానానికి అప్పగించారు. దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దానిని ప్రారం భిస్తారు. ముందుగా ఆలయ రాజగోపురం ముందు స్వర్ణరథానికి మిగతా 2లో


రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

### రవాణా రంగం
# బంద్ సంపూర్ణం

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** కేంద్రం ప్రభుత్వం తీసుకవచ్చిన హిట్ అండ్ రన్ సెక్షన్ 106-1-2లను రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఏఐఆర్‌టీడబ్ల్యు సంఘాల పిలుపు మేరకు శుక్రవారం లాంగ్‌లారీ ఓనర్ అసోసియేషన్, మోటార్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మిగతా 2లో

## శ్రీశైలంలో శాస్త్రోక్తంగా
# మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

శివాజీ గోపుర పునర్నిర్మాణం, ఆలయ ప్రాంగణంలో కొన్ని ఉపా లయాల పునరుద్ధరణ, పంచమఠాలలోని మూడు మఠాల పునరుద్ధరణ, ఆయా ఉపాలయాలలో, మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ట సంద ర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి విచ్చేశారు. కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రదక్షిణ చేశారు. తరువాత యాగ శాల ప్రవేశ కార్యక్రమం నిర్వహించబడింది. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ మహాకుంభాభిషేక సంకల్పం పఠించబడింది.

**అంకురార్పణ :** ఉదయం 7 గంటలకు మహాకుంభాభిషేక సంకల్పం, గోపూజ, గణపతిపూజ, ఋత్విగ్వరణం. దీక్షాధారణ, పర్యగ్నికరణం, యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, మండపారాధనలు, మూలమంత్రానుష్టానాలు, పారాయణలు, అఖండ దీపస్థాపన పూజా కార్యక్రమాలు సాయంత్రం 4.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్టాపన, దేవతాహవనములు, వేదహవనములు, జలాధివాసం, వేద స్వస్తి, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. మహాకుంభాభిషేకం అంకురార్పణ క్రతువులు జరిపిన అనంతరం శనివారం నుంచి ఈ నెల 20వ వరకు ప్రతిరోజు గోపూజ, మండపపూజలు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయ ణలు, హోమములు, వేదహవనములు, వేదస్వస్తి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయాలలో జరిగే అత్యద్భుత కార్యక్రమమే మహాకుంభాభిషేకం. ఈ మహిమాన్విత కార్యక్రమములో విధివిధానముగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపి, ఆ మంత్రపూరిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలను, గోపురాలను, దేవతామూర్తులను అభిషేకించడం జరుగుతుంది. ఈ కుంభాభిషేకం చేసినందువల్ల ఆలయ విమాన శిఖరాన్ని దర్శించినంతనే చతుర్విధ పురుషార్థ సిద్ధి, మానసిక ప్రశాంతత, భక్తి, అధ్యాత్మిక పరిపుష్టి, ఆయుర్వృద్ధి, కీర్తి, జయం కలుగుతాయని, శారీరక, మానసిక వ్యాధులు నశిస్తాయని, సకల ఆపదలు తొలుగుతాయని, అభివృద్ధి చేకూరుతుందని చెప్పబడుతోంది. మహా కుంభాభిషేకం ప్రారంభ పూజ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు,స్థానిక శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, విజయలక్ష్మీ డా.సి.కనక దుర్గ, అధికారులు, అర్చక స్వాములు, వేద పండితులు పాల్గొన్నారు.



మహాకుంభాభిషేకం కోసం చేసిన ఏర్పాట్లు



మహా కుంభాభిషేకం ప్రారంభ పూజా కార్యక్రమాల దృశ్యాలు

**21న శివాజీగోపుర సువర్ణ కలశ ప్రతిష్టాపన :** మహాకుంభాభిషేకంలో భాగంగా ఈ నెల 21న ఉదయం 7గంటలకు శాంతిహోమం, పౌష్టికహోమం, మహాపూర్ణాహుతి జరిపిస్తారు. ఉదయం 8.45 గంటల నుంచి పునరుద్దరించిన ఆలయాలలో యంత్ర ప్రతిష్ఠ, శివలింగ నందీశ్వర ప్రతిష్టలు, శివాజీ గోపురమునకు సువర్ణ కలశ ప్రతిష్ఠలు జరిపిస్తారు. అనంతరం 9.45 గంటలకు ఉభయ ఆలయాల గర్భాలయ విమానాలకు, గోపురాలకు, మూల మూర్తులకు, ఇతర దేవతా మూర్తులకు మహాకుంభాభిషేకం జరిపిస్తారు. అనంతరం అవబృథం, గురువందనం, మహాదాశీర్వచనం, వేద సభ నిర్వహించనున్నారు.

## సర్వదేవాత్మకుడు ఆదిత్యుడే

(మొదటిపేజీ తరువాయి)




మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వేంకటరెడ్డి

వేంకటరెడ్డి అన్నారు. రథసప్తమి సందర్భంగా శుక్రవారం కర్నూలు శివారులోని క్రెడో పాఠశాలలో విద్యార్థులతో ఆదిత్య హృదయం పారాయణం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి లలితా పీఠం పీఠాధిపతులు శ్రీగురు మేడా సుబ్రమణ్యం స్వామి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మన సంస్కృతి, సంప్రదాయాలను బాల్యం నుంచే నేర్పించాలన్నారు. విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు మాట్లాడుతూ సూర్యునిపై అనేక పరిశోధనలు నేటికి జరుగుతున్నాయని, సైన్స్‌కు అందని విషయాలను మన ఋషులు వేల సంవత్సరాల క్రితమే సూర్యుడిని ఉపాసించి పొందారని తెలిపారు. వివేకానంద కేంద్ర యోగా మాస్టర్ అనంతఅనిల్‌కుమార్ విద్యార్థులచే వివిధ యోగాసనాలు చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు నుంచి విద్యార్థులకు ఉపయోగపడే ఇంతమంచి కార్యక్రమం చేయడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్యకార్తీక్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం అనంరతం విద్యార్థులకు ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల భోధన, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లన్నకు స్వర్ణరథం

(మొదటిపేజీ తరువాయి)

సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు జరిపించబడ్డాయి. కార్యక్రమములో భాగంగానే రథాంగహోమం, రథాంగబలి తదితర కార్యక్రమాలను జరిపించడం జరిగింది.సంప్రోక్షణ, ప్రారంభపూజల తరువాత ఆలయ రాజగోపురం ముందుభాగం నుంచి నంది ఆలయం వరకు తిరిగి నంది ఆలయం నుంచి ఆలయ రాజగోపురం వరకు శ్రీస్వామిఅమ్మవార్ల స్వర్ణరథోత్సవం జరిపించబడింది.కాగా ఈ స్వర్ణరథోత్సవంలో నాదస్వరం, కోలాటం తదితర కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి, విజయలక్ష్మీ, డా.సి.కనకదుర్గ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రవాణా రంగం బంద్ సంపూర్ణం

(మొదటిపేజీ తరువాయి)

బంద్ సంపూర్ణమైంది. నగరంలోని కార్బైట్ ఫ్యాక్టరీ సమీపంలోని బెంగుళూరు–హైదరాబాద్ నేషనల్ హైవేపై గంటరన్నరపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన న్యాయ సంహిత 2023 చట్టాన్ని రద్దు చేయాలన్నారు. డ్రైవర్ చిన్నతప్పిదం వల్ల పదేళ్లు జైలు శిక్ష, రూ.10లక్షలు జరిమానా విధించడం ప్రభుత్వానికి సరైంది కాదన్నారు. దేశ సంపదలో సగం రవాణా రంగం నుంచే వస్తుందని, అలాంటి వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. వెంటనే జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు శ్రీను, శ్రీనాథ్‌సలార్, మోటార్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు తిమ్మప్ప, ఖాజా, రఘు పాల్గొన్నారు.

## డిస్పాచ్ సెంటర్లను జిల్లా కలెక్టర్ పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

భార్గవతేజ, ఇరిగేషన్ డీఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీఆర్వో మధుసూధన్‌రావు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ఆలయంలో
## వైభవంగా రథసప్తమి వేడుకలు
### – ఆకట్టుకున్న కోలాటాలు, నృత్యాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సృష్టిలో జీవరాసులన్ని సుభిక్షంగా ఉన్నాయంటే సూర్యభగవానుడేనని, హిందూ సాంప్రదాయంలో సూర్యోదయానికి ప్రాముఖ్యత ఉంది. మాఘమాసం, శుక్ల పక్ష సప్తమి తిథినాడు వచ్చే సూర్య జయంతిని అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు. శుక్రవారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటి ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకొని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్దలతో వేడుకలను నిర్వమించారు. రథసప్తమిని పుస్కరించుకొని రథోత్సవాన్ని కోలాటాలు, నృత్యాల ద్వారా ఆలయం చుట్టు అత్యంత వైభవంగా నిర్వహించారు. రథసప్తమికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో రథోత్సవంగా కన్నుల పండుగగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు.



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై
# ప్రజాపోరుకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తున్నట్లు, ఇక ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాల దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాష్ట్రానికి బీజేపీ చేసిన అభివృద్ధిని వివరిస్తామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రజాపోరు కార్యక్రమం స్టేట్ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలులోని ఫైమ్‌ల్యాండ్ హోటల్‌లో రాయలసీమ జోనల్ కన్వీనర్ పోలంకి రామస్వామి, జిల్లా కో–కన్వీనర్ నగరూరు రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, అసెంబ్లీ కన్వీనర్ సూర్యప్రకాష్, సీనియర్ నాయకులు సందడి సుధాకర్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపోరు యాత్రలో రాష్ట్ర, జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు పాల్గొంటారన్నారు. 75అసెంబ్లీ నియోజకవర్గాల్లో కరపత్రాలు, డిజిటల్ ప్రచారాలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేసినట్లు ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రులను బదిలీ చేసి వారిని చెల్లని రూపాయిగా మార్చారని విమర్శించారు. ఒక జిల్లాలో చెల్లని రూపాయి మరో జిల్లాలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. సామాజిక సమీకరణ అని చెప్పే జగన్‌రెడ్డి దానికి అర్థమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. 2024లో మీ జిమ్మిక్కులు, గారడీలు చెల్లవని, ఈ విషయం వైసీపీ నాయకత్వం గ్రహించాలన్నారు. తెలంగాణలో పార్టీ జెండా పీకేసి ఇక్కడ పీసీపీ అధ్యక్షురాలుగా షర్మిల అద్దెకు వచ్చారని విమర్శించారు. ఇక్కడ పీసీసీ అధ్యక్షునిగా పనిచేసే సామర్థ్యం, అర్హత స్థానిక నాయకులకు లేదా అని, ఈ విషయంపై ఏపీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలోచించాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి మేనిఫెస్టో ప్రకటించడానికి ఏపీకి వస్తున్నారని, ముందు తెలంగాణ ప్రభుత్వం ఏపీ మీద కోర్టుల్లో వేసిన కేసులను ఉపసంహరించుకునే విధంగా కాంగ్రెస్ నేతలు కోరాలని పిలుపునిచ్చారు. తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ ఎప్పుడు వేరే కాదని, వీరిదంతా డూప్లికేట్ ఫైట్, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చడానికి ఆడే డ్రామా అని ఘాటుగా విమర్శించారు. అవినీతిలో కూరుకపోయిన కాంగ్రెస్ నేతలు బీజేపీ, మోడీని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించడం లాంటిందన్నారు. కొన్ని పార్టీలు మాతో పొత్తు కోసం ప్రయత్నం చేస్తూనే ప్రత్యేక హోదా పేరుతో మమ్మల్ని విమర్శిస్తుంటారని పరోక్షంగా టీడీపీని విమర్శించారు. ప్రత్యేక హోదా అనేది దేశంలోనే లేదని, ఇక ప్రత్యేక హోదా, విభజన హామీల పేరుతో ప్రజలను మోసం చేయవద్దని కోరారు. ప్రత్యేక హోదా అజెండాతో 2019లో పోరాడిన పార్టీలు ఎన్నికల్లో ఏం సాధించారని నిలదీశారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రాంతీయ పార్టీలు ప్రైవేట్ లిమిటెడ్ రాజకీయాలు చేస్తున్నాయని, ఇక ప్రాంతీయ పార్టీల శకం ముగిసిందన్నారు. కొన్ని పార్టీలు ఒకే కుటుంబానికి ఒకే టికెట్ అంటూ ఆ పార్టీ అధినాయకత్వం కుటుంబంలో నలుగురు పోటీ చేస్తున్నారంటా నాయకత్వాన్ని ప్రశ్నించే వారే ఎవరు ఉన్నారన్నారు. 3వసారి మళ్లీ ప్రధానంగా మోడీ, బీజేపీ ప్రభుత్వం దేశంలో ఏర్పాటు కానుందన్నారు. టీడీపీ, జనసేనతో పొత్తు అంశాలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, పొత్తుల అంశం జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని, తాము పొత్తు కోసం ఆరాటం పడటం లేదని, ప్రస్తుతం జనసేనతో మాత్రమే తమకు పొత్తు ఉందని పేర్కొన్నారు. 175అసెంబ్లీ, 25పార్లమెంటు స్థానాల్లో తాము పోటీకి సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే 25పార్లమెంటు కేంద్రాల్లో కార్యాలయాలు ప్రారంభించిన అంశాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు సందడి సుధాకర్, కాళింగి నరసింహవర్మ, జిల్లా నాయకులు కాశీవిశ్వనాథ్, మద్దిలేటి, హవిలన్‌బాబు, మహిళా నాయకురాలు మాలతి, ఎస్సీ మోర్చా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అప్పు తీర్చలేదనే కోపంతో బాలుడి కిడ్నాప్.. కేసు నమోదు


చికిత్స పొందుతున్న చక్రి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** అప్పు తీర్చ లేదన్న కోపంతో సోదరుడి కుమారుని కిడ్నాప్ చేసి హత్య యత్నానికి పాల్పడ్డ సంఘటన ఆళ్లగడ్డ పట్టణంలో చోటు చేసుకుంది. శుక్రవారం సీఐ రమేష్ బాబు మేజర్ న్యూస్‌తో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వెంకట లక్ష్మమ్మ తన సోదరుడు బోయ భూపాల్ కు కొంత సొమ్మును అప్పుగా ఇవ్వడం జరిగింది. చాలా రోజులైనప్పటికీ తన సోదరుడు భూపాల్ అప్పుగా తీసుకున్న సొమ్మును ఇవ్వాలని అడగడం జరిగింది. తన దగ్గర ప్రస్తుతానికి డబ్బులు లేవని భూపాల్ చెప్పగా నీ పేరు మీద ఉన్న ఇంటిని రాసి ఇవ్వాలని అక్క వెంకట లక్ష్మమ్మ డిమాండ్ చేయడం జరిగింది. ఉన్న ఇంటిని మీకు రాసిస్తే మేము ఎక్కడ ఉండాలి, నా కొడుకుకు జీవనాధారం జరిగేది ఎలా అని అక్కతో చెప్పడం జరిగింది. దీంతో ఆమె రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో చదువుతున్న తన సోదరుడి కొడుకు చక్రి (11) పాఠశాలకు వెళ్తుండగా కొత్తూరు సుధాకర్ అనే వ్యక్తితో కలిసి కారులో వెళ్లి కిడ్నాప్ చేయడం జరిగింది. బాలుని గొంతు నులిమి కడప జిల్లా బ్రహ్మంగారి మఠం సమీపంలోనీ లోయలో పడవేయడం జరిగింది. కానీ అదృష్టవశాత్తు ఆ బాలునికి ప్రమాదం ఏమీ జరగలేదు. లోయల నుండి బయటకు వచ్చి సమాచారాన్ని ఇతరుల సెల్ఫోన్ ద్వారా తన తండ్రికి తెలియజేయడం జరిగింది. వెంటనే తండ్రి భూ పాల్ ఆళ్లగడ్డ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు వెంకట లక్ష్మమ్మ, సుధాకర్ లపై 364 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సిఐ రమేష్ బాబు తెలిపారు. బాలున్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

# కార్మిక రైతు ద్రోహి నరేంద్రమోడీ..

మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి..


ధర్నా చేస్తున్న దృశ్యం

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని ఏఐటీయూసీ, సిఐటియు, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్‌లో ధర్నా నిర్వహించి.తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ మండల కార్యదర్శి మాధవస్వామి సిఐటియు మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికులు స్వతంత్రానికి పూర్వం నుండి పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక చట్టాల్లోని సారాన్ని తగ్గించారని ఆరోపించారు. రైతులకు నష్టం కలిగించే చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్లకు దోచి పెట్టాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తే రైతులు పోరాడి వెనక్కి కొట్టారని తెలిపారు. రైతులకు ఇచ్చిన స్వామినాథన్ సిఫారసుల అమలు హామీని పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం ఇంతవరకు నెరవేర్చలేదని అందుకే రైతులు ఢిల్లీ బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. దేశంలో రైతులు కార్మికులు వ్యవసాయ కూలీల పరిస్థితులు మోడీ విధానాల వల్ల ఆందోళనకరంగా మారాయని తెలిపారు. తక్షణమే లేబర్ కోర్సును రద్దు చేసి, రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కూలీలకు కనీస వేతనం 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె గ్రామీణ బంద్ చూశాకైనా మోడీ ప్రభుత్వం కళ్లు తెరవాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు రాముడు, మండల నాయకులు చిన్న యేసు, సత్యం, మహేష్, అయ్యాస్వామి, అలివేలు ఏఐటీయూసీ కార్యదర్శి హరి, పట్టణ కార్యదర్శి గిరిబాబు, రైతు సంఘం నాయకులు మాధవ కృష్ణ భవన నిర్మాణ కార్మిక జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్

**బండి ఆత్మకూరు రూరల్ మేజర్ న్యూస్ :** రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బండిఆత్మకూరు మండలకేంద్రంలో దేశ వ్యాప్త గ్రామీణ బందులో భాగంగా సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నందు రాస్తారోకో నిర్వహించారు. దుకాణాలు బ్యాంకులు మూసి వేయించి గ్రామీణ బంద్ ని విజయవంతంగా నిర్వహించారు. అనంతరం రాస్తారోకో నితించారు. రైతు కార్మిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రత్నమయ్య ,రాజు,డేవిడ్ రామచంద్రుడులు మాట్లాడుతూ అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర చట్టం పార్లమెంట్లో గ్యారెంటీ చేసే చట్టం తెస్తామని, 2021 విద్యుత్ సవరణ బిల్లు వెనక్కి తీసుకుంటామని రైతు ఉద్యమానికి ప్రభుత్వం హామీ ఇచ్చి ఆ దిశగా ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదు అన్నారు. దీంతో రైతులు మళ్లీ ఉద్యమించారు. రైతులను ఢిల్లీలోకి రాకుండా అడ్డుకునేందుకు హర్యానాలోని బిజెపి ప్రభుత్వం పోలీసులు విచక్షణారహితంగా డియర్ గ్యాస్ ప్రయోగిస్తూ డియర్ గ్యాస్ నిఘా కోసం డ్రోన్లను ఉపయోగిస్తూ రైతు ఉద్యమాలను అణిచివేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డేవిడ్ మాట్లాడుతూ ఉపాధిహామీకి నిధులు పెంచి ముఖ ఆధారిత యాప్ను రద్దు చేయాలని రెండు పూటలా పనివిధానం రద్దుచేసి 600 కూలీ 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు రత్నమయ్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు సిఐటియు నాయకురాలు స్రవంతి, శిరోమణి, ఆశ వర్కర్ నాయకురాలు సువర్ణమ్మ, ఖాదరయ్య మహేష్ రైతు సంఘం నాయకులు, ఏసన్న సంజీవరెడ్డి, బాల మద్దిలేటి నాగరత్నం, నక్క శీను ,మధు తదితరులు పాల్గొన్నారు.


రాస్తా రోకో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

# మోడీ పాలనకు చరమగీతం పాడుదాం

– సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎ.గఫూర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**

దేశంలో నరేంద్రమోడీ పాలనకు చరమగీతం పాడుదామని కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.గఫూర్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌యూసీఐ, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు జగన్నాథం, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మిక చట్టాలను మార్పు చేస్తూ వారి హక్కులను కాలరాస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మునియప్ప, అంజిబాబు, నారాయణ, శ్రీనివాసరావు, పోతుల సురేష్, భాస్కర్, చంద్రశస్త్రఖర్, అరులప్ప, నరసింహులు, రాముడు, వెంకటేశ్వర్లు, సుధాకర్, నరసింహులు, మనోహర్, సురేష్‌నాయక్, రమణ, దామోదర్, రాజు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# అనాధలకు బెడ్‌షీట్లు పంపిణీ

పంపిణీ చేసిన డిప్యూటీ ఎమ్మార్వో .అరుణ



**పాములపాడు, మేజర్ న్యూస్ :** ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ ఎమ్మార్వో అరుణ పాములపాడు మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామం వద్ద రోడ్డుపై వెళ్తున్న అనాధలకు బెడ్ షీట్లు ఆమె పంపిణీ చేశారు గత 20 సంవత్సరాలుగా రోడ్లపై ఉన్న అనాధలకు భోజనం వసతులు తదితర వస్తువులు పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు. మన చేతనైన చిన్న ఆర్థిక సహాయంతో అనాధలు ఏదో కొద్దిగా సహాయం చేయడం వల్ల దేవుడు తమ కుటుంబాలకు చల్లగా చూస్తాడని అన్నారు.

# ఈనెల 22 లోపు రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** రబీలో పంటలను సాగు చేసుకున్న రైతులు ఈనెల 22 లోపు తమ సమీప రైతుభరోసా కేంద్రాలలో ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. శుక్రవారం మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. రికార్డును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కిసాన్ ఈకేవైసీ కూడా పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ ఇతరత్ర పథకాలు అందాలంటే తప్పని సరిగా ఈకేవైసీ అవసరం అన్నారు. సిబ్బంది స్వామి. అనూష రైతులు పాల్గొన్నారు.

# ఎర్రగుడూరులో పోలీసుల పల్లెనిద్ర

**పాములపాడు, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికల నేపథ్యం ఎర్రగుడురు గ్రామంలో పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సిఐ నాగభూషణం ఎస్ఐ అశోక్‌లు బస చేశారు. అంతకుముందు నిర్వహించిన ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు సిఐ నాగభూషణం,ఎస్సై.అశోక్‌లు మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని,ప్రజలు ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావ్వికూడదని సూచించారు. నాటుసారా దొంగతనాలు జూదంపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల వేళ ఎవరైనా గొడవలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# ఎనిమిదవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలి

తపాలా ఉద్యోగుల ధర్నా..




**బనగానపల్లె,మేజర్‌న్యూస్ :** ఎనిమిదవ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని,కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని,కేంద్ర ప్రభుత్వ సంస్థలను కార్పోరేటికరణ, ప్రైవేటీకరణ ఆపాలని, తపాలా శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కొరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సమాఖ్య పిలుపుమేరకు ఒకరోజు అన్ని తపాలా శాఖ కార్యాలయాల ముందు సాయంత్రం గేటు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని బనగానపల్లె పోస్ట్ మాస్టర్ మురలీకృష్ణ తెలి పారు. ఈ సందర్భంగా బనగానపల్లె తపాలా శాఖ కార్యాలయం ముందు శుక్రవారం తపాలా ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పోస్ట్ మాస్టర్ మురళీ కృష్ణ, సౌత్ పోస్టుమాస్టర్ విజయ్ కుమార్, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ వేణుగోపాల్ రావు, పోస్టల్ అసిస్టెంట్లు నాగరాజు,దస్తగిరిరెడ్డి, రిజ్వాన్, రామేశ్వరుడు గ్రామీణ తపాలా ఉద్యోగులు జయన్న,రాముడు,ఇతర తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ భారత్ బంద్ విజయవంతం..



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మండల కేంద్రంలో గ్రామీణ బంద్ విజయవంతమైంది. వాపక్ష పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలనికోరారు. ప్రధాని నరేంద్ర మోడీ వల్లే రైతులు నష్టపోతున్నారని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల, కార్మికుల, రైతుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. రైతు నల్ల చట్టాలను, లేబర్ కోడ్‌లను రద్దు చేసి ఆయా రంగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగ్గ వేతనం అమలు చేయాలని వారు చెప్పుకొచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానానికి స్వస్తి చెప్పాలని, ఆకాశాన్ని అంటుకున్న ధరలను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, సిపిఎం నాయకులు రాముడు,రైతు సంఘం నాయకులు కెసి జబ్బర్,బీటీ చిన్నన్న, దాదావలి, బజారి కాజా, ఇస్మాయిల్, బతకన్నా, లక్ష్మీ నరసయ్య,అబ్దుల్లా, విద్యార్థి సంఘాల నాయకులు రంగస్వామి,విజయేంద్ర మహేంద్ర,సురేష్ ఎంపీ జే నాయకులు ఖాదీర్ పాల్గొన్నారు.

సూర్య

శనివారం 17 ఫిబ్రవరి 2024

# వాస్తవాలు తెలుస్తాయనే రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకుంటున్న వైసిపి ప్రభుత్వం




మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** వాస్తవాలు తెలుస్తాయని వైసీపీ ప్రభుత్వం రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకుంటుందని ,అలాగేరాష్ట్రంలోఅధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ మూడు రాజధానులు ప్రకటించి ఇంతవరకు ఒక్కటి కూడా పూర్తిచేసిన పాపాన పోలేదని సిరివెళ్ల టిడిపి మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చాంద్‌బాషా, కౌన్సిలర్ హుస్సేన్ భాష,చాగలమర్రి మండల కన్వీనర్ న్యాయవాది కరి మద్దెల నరసింహారెడ్డిలు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ఆమెస్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి వాటిని నిలుపుకోలేదన్నారు. మాట తప్పను మడ మ తిప్పను అంటూ ఉపన్యాసాలు ఇచ్చిన ఆయన రాజధాని విషయంలో ఏమి చెప్పలేదు అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలని అందుకే మూడు రాజధానులు అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పారని ఇప్పుడు ఏ ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. ఎన్నికల సమీపిస్తున్న ఈ తరుణంలో తెలంగాణ, ఆంధ్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉందని మనకు మరో రెండు సంవత్సరాలు అవకాశం ఉందని అందువల్ల హైదరాబాద్‌నే రాజధానిగా కోరుతామని వైకాపా నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు అమరావతి రాజధాని విషయం ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో రాజధాని ఫైల్స్ సినిమా తీస్తే ప్రజలకు వాస్తవాలు తెలిస్తే తమ ప్రభుత్వ మనుగడ ఉండదని భావించిన వైకాపా నాయకులు సినిమాను అడ్డుకున్నారన్నారు. ఇంతకంటే దిగజారుడుతనం ఏముంటుందని వారు ప్రశ్నించారు. ఇవే కాక మిగిలిన విషయాల్లో కూడా మాట తప్పారని వారు విమర్శించారు.

# వైఎస్ఆర్సిపి పార్టీలో పనిచేసే కార్యకర్తకు పెద్దపీట

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలకు జలవనరుల శాఖ రాష్ట్ర సలహాదారుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు, గంగుల బిజేంద్రారెడ్డిల సహకారంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఇందుకు నిదర్శనమే వెంకటేశ్వర బోర్వెల్ ప్రొప్రైటర్ చుండూరు వెంకటరమణకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి గా బాధ్యతలు అప్పజెప్పడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పదవి చేపట్టిన చుండూరు వెంకటరమణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడిగనూరు ఎంపీటీసీ పత్తి నారాయణ,జిల్లాసేవాదళ్ అధ్యక్షులు గణేష్



వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

రామ సుబ్బారెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధి షేక్ మహబూబ్ భాష ఎన్ఆర్ఐ సోషల్ మీడియా ప్రతినిధి అనీఫ్, మద్దూరు షరీఫ్ ఎర్రం నవీన్ కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుండూరు వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర జలవనుర్ల సలహాదారుడు మాజీ శాసనమండలి సభ్యులు గంగుల ప్రభాకర్ రెడ్డి,ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో రాష్ట్ర పదవిని నాకు బాధ్యతాయుతంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ కోసం ఆళ్లగడ్డ శాసనసభ్యులు గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తానన్నారు. పార్టీ నాపై నమ్మకంతో ఇచ్చిన పదవిని అంకితభావంతో స్వీకరించి పార్టీ అభివృద్ధికి ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తానన్నారు. ఈ పదవి కోసం సహకరించిన మండల కన్వీనర్ కుమార్ రెడ్డికి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీప్రధాన కార్యదర్శి, జిల్లా జెసిఎస్ కన్వీనర్ షేక్ బాబూలాల్ కు పార్టీ నాయకులకు అభినందనలు తెలిపారు.

# రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న జగన్ ..మాజీ ఎమ్మెల్యే బీసీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రైతుల జీవితాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెలగాటం ఆడుతున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారంనాడు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె మండల పరిదిలోని నందవరం గ్రామంలో ఆయన పర్యటించి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్‌సిక్స్ పథకాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇస్తే వైకాపా అధికారంలోకి వచ్చాక రైతులను గాలికొదిలేసిందని సరైన సమయానికి పంటలకు సాగు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే అన్నదాత పథకం ద్వార ప్రతి రైతుకు ఏడాదికి 20వేల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని హైకోర్టు తీర్పుతో సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ రావడం స్వాగతిస్తున్నామన్నారు. ఈ సినిమా చూసి జగన్ రెడ్డిని ప్రజలు ఎక్కడ ఛీ కొడతారోనని భయపడి సినిమా విడుదల అవ్వకుండా దిగజారుడు చర్యలకు దిగారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండాలని అప్పుడు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ సంక్షేమం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాల అద్యక్షులు పి.వి కుమార్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, లక్ష్మీ రెడ్డి, రమణా రెడ్డి, బోయ వెంగన్న, చింతమాను వలి, రామ్మోహన్, బాల వెంకటేశ్వర్లు, జంబులయ్య, టీడీపీ నాయకులు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీ చెన్నకేశవ స్వామి సన్నిధిలో

# మాజీ టీడీపీ ఇంఛార్జీ కృష్ణమ్మ

**ఆదోనిరూరల్,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని సంతేకూడ్లూరు గ్రామంలో రథసప్తమి సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారిని, అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఆదోని క్రాంతినగర్‌లో జమ్మి మహాంకాళమ్మ నూతన దేవాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ టీడీపీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపిపి మురళీ, ముస్లీం మైనార్టీ నాయకుడు సాదీక్ వలి, స్థానిక నాయకులు ముక్కన్న, బజారప్ప, మహాలింగ, సిద్ద, మహేంద్ర, మౌనేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సంప్రదాయబద్ధంగా రథసప్తమి వేడుకలు



సూర్యనారాయణస్వామి

**అవుకుమేజర్,న్యూస్:** అవుకు మండలంలోని శివవరం గ్రామంలో చాళుక్య రాజులచే నిర్మితమైన దాదాపు 600సంవత్సరాల కిందటి సూర్య దేవాలయంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను వేదపండితులు జొన్నగడ్డ హరినిర్వహించారు. తెల్లవారుజామున 4గంటలకే స్వామి వారికి అభిషేకం, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమా లను నిర్వహించిన అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్ప మాలికలతో అలంకరింపజేసి అష్టోత్తర శతనామ పూజల అనంతరం భక్తులకు శ్రీస్వామి వారిని దర్శింపజేశారు. వేలాదిగా భక్తులు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి శ్రీస్వామి వారిని సేవించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించి వెళ్లారు. కోలాటాలు, చెక్కభజనలు తదితర కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. రథస్తమి యొక్క విశిష్టతను గురించి కొలిమిగుండ్లకు చెందిన ప్రసాదశర్మ భక్తులకు తన ప్రవచనం ద్వార వివరించారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాలన్నీ గ్రామ సంఘం ద్వార గ్రామ పెద్దలు భక్తాదుల ద్వార నిర్వహించారు.

# రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌కు వణుకు..!

**వాస్తవాలు తట్టుకోలేక పోతున్నారు..మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి**



మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** వాస్తవ సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రజల ముందుకు తీసుకొచ్చిన రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్‌రెడ్డి గుండెల్లో వణుకు మొదలైందనిఎమ్మిగనూరు టీడీపీ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..సామజిక భాధ్యతతో సినిమాతీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. 34వేల రైతుల త్యాగాలతో వాస్తవ రూపంగా నిలిచిందని, అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు తెలిపిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మాట మార్చారన్నారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం రాష్ట్ర చరిత్రలోనే ఇదే తొలిసారి అన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో రాజధాని రైతులను జగన్ రెడ్డి అరాచకపాలన చేసిన దుర్మార్గాలను, దౌర్జన్యాలను, దాడులను వాస్తవ సన్నివేశాలకు దగ్గరగా చూపారనే అక్కసుతో సినిమాను అడ్డుకుంటున్నారన్నారు. రాజధాని నిర్మాణం చేతకాక ఓటమి భయం పట్టుకున్న జగన్ రెడ్డి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నిన్నటి దాకా మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంటుందని అన్నారు. ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రన్న పాలనలో సంక్షేమ పాలన అందిస్తామన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు మండలంలోని విద్యుత్ వినియోగదారులకు నేడు మూడవ శనివారం సందర్భంగా విద్యుత్ లైన్లు మరియు సబ్స్టేషన్ నిర్వహణలో భాగంగా వెల్దుర్తి, గోవర్ధనగిరి, చెర్ల కొత్తూర్, కలుగొట్ల సబ్ స్టేషన్ పరిదిలోని వినియోగదారులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందనీ విద్యుత్ శాఖ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు త్రీఫేస్ క్రింద వ్యవసాయ విద్యుత్తు వేళలు ఈ విధంగా ఉండనున్నట్లు అన్ని ఫీడర్లు ఉదయం 5.30 నుండి 9.30 మరియు 14.00 నుండి 17.00 అలాగే రామల్లకోట సబ్ స్టేషన్ కింద రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరా అన్ని ఫీడర్లు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ విధంగా ఉంటున్నాయని ఆయనతెలిపారు. కావున దయచేసి వినియోగదారులు సహకరించగలరనీ కోరుకుంటున్నామని తెలియజేశారు.

## వైఎస్ఆర్సిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన 50 కుటుంబాలు



**వెలుగోడు మేజర్ న్యూస్ :** అధికార వైఎస్ఆర్సిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోచేరిన 50కుటుంబాలు. మండల పరిధిలోని వేల్పనూరు గ్రామం మాజీ ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో బండి ఆత్మకూరు మండలం చిన్నదేవులాపురం గ్రామానికి చెందిన తెల్ల పూరి నారాయణ (మాజీ ఎంపీటీసీ), తెల్లపూరి ఈశ్వరయ్య (మాజీ సర్పంచ్), పసుపుల మహేష్, గుండుగారివెంకటేశ్వర్లు,లక్ష్మన్న, శివశంకర్, శివయ్య,రాజు, దాసరి మౌల (గృహ సారథి), శివ కృష్ణ లతోపాటు 50 కుటుంబాలు చేరాయి. వీరికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా మాజీ ఎమ్మెల్యే ఆహ్వానించారు. తదనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవరుఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

## జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలలో గురురాజా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న షేక్షావలిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రోడ్డు భద్రతా వారోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలలో శ్రావణి ధరణిధర్, సుబ్బరాయుడు, మధుమోహన్, గౌతం నాయక్ బహుమతులు సాధించినట్లు తెలిపారు. వీరికి అధికారులు జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి విద్యార్థుల విజయా లను ప్రశంసించినట్లు తెలిపారు. జిల్లాలో అత్యధిక బహుమతి సాధించిన ఏకైక పాఠశాల గురురాజ అని తెలియజేయడానికి సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. విద్యార్థుల విజయానికి చక్కనిశిక్షణఇచ్చినడ్రాయింగ్‌మాస్టర్‌ను అభినందించారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిలను అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9వతేదీ నుంచి 11వతేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కర్నూలునగరం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ప్రతిభకనబరిచారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కె.శాంత విద్యార్థినిలను అభినందించారు. ప్రస్తుత రోజుల్లో కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని, ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సోనిష, అనురాధ, సౌజన్య, రేవతి, ఆశాజ్యోతి పతకాలు సాధించినట్లు తెలిపారు.కళాశాల మహిళా సాధికారిక విభాగ సభ్యులు షహనాజ్‌బేగం, సల్మాసుల్తాన, ఆర్మిలిరెడ్డి, పృధ్వీలక్ష్మి, శ్వేతకుమారి, పాల్గొన్నారు.

## నందవరం చౌడేశ్వరీమాతను దర్శించుకున్న బీసీ దంపతులు



అమ్మవారికి పూలమాల సమర్పిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారిని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి వారి సతీమణి బీసీ ఇందిరమ్మలు శుక్రవారంనాడు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో ఉం డాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

ప్రతిరోజు యోగా చేయడం ద్వార సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చునని యోగా గురువు ఇల్లూరి రామమూర్తి అన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని స్థానిక ఆర్య వైశ్య భవనం నందు శుక్రవారం తెల్లవారు జామున ప్రత్యేకంగా సూర్య నమస్కారాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువు ఇల్లూరి రామ్మూర్తి మాట్లాడుతూ రథసప్తమి సందర్భంగా శుక్రవారంనాడు 54సార్లు సూర్యనమస్కారాలు చేశామన్నారు. ప్రతి ఒక్కరి దినచర్యలో యోగాసనాలు ఒక భాగం కావాలన్నారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వార సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. యోగా చేయడం వల్ల బీపీ, దయాబెటీస్, శ్వాసకోస తదితర వ్యాధులు నియంత్రణలో ఉంటాయని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ భవనం నందు ప్రతిరోజు యోగాసనాలు నేర్పించడం జరుగుతుందని తెల్లవారుజామున 5ః30నిముషాల నుండి 7గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె బార్ అశోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ జడ్.వి క్రిష్ణా రెడ్డి, గోపాల్, సూర్య శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో కిడ్నీమార్పిడి విజయవంతం

**– జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి**



పేషెంట్లతో డాక్టర్ బృందం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇద్దరు పేషెంట్లకు కిడ్నీ మార్పిడి చికిత్స విజయవంతమైందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. పేషెంట్లు ఈరన్న, ఎస్తేర్ రాణిలకు ఇటీవల బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందిన పావనిలత కిడ్నీలను అమర్చినట్లు తెలిపారు. పావనలత అవయవదానం వల్ల నలుగురికి పునర్జన్మ ఇచ్చిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సీతారామయ్య, ముత్యశ్రీ, ప్రభాకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, ఏవీఎస్‌రెడ్డి, హెచ్ఓడీలు సీతారామయ్య, కొండారెడ్డి, వెంకటపక్కిరెడ్డి, అనంత్ పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ: గౌరుచరితారెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న గౌరుచరితారెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** చంద్రబాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ అని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరుచరితారెడ్డి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, పార్లమెంటు ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కిషన్, మహబూబ్‌బాష, వైస్ సర్పంచ్ సమీనా, సామన్న, కాల్వ రజాక్‌బాష పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి బీసీవై పార్టీ కృషి

**తుగ్గలి,మేజర్‌న్యూస్ :**రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీల అభివృద్ధికి భారతీయ చైతన్య యోజన పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పత్తికొండ నియోజకవర్గ బీసీవై ఇన్‌చార్జి జొన్నగిరి మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం రాంపల్లి గ్రామంలో బీసీవై పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిద్దె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు కంపెనీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నాయకుడు లక్ష్మినారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పురాణ ఇతిహాసాల వేషధారణలో ఆకట్టుకున్న శ్రీ సంకల్ప్ స్కూల్ చిన్నారులు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న శ్రీ సంకల్ప్ పాఠశాల నందు శుక్రవారం మిథాలజీ ఫర్ మిలీనియల్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పురాణేతిహాసాలకుసంబంధించిన పలు సన్నివేశాలను వేషధారణల ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. ఇందులో భాగంగానే స్నేహ బంధానికి ప్రతీకలైన శ్రీకృష్ణ– సుధాముడు, కర్ణ – దుర్యోధనులు, గురు శిష్య బంధానికి ప్రతీకలైన ద్రోణాచార్య –ఏకలవ్యుడు ఇంకా అన్నదమ్ముల అనుబంధం,కుటుంబబాంధవ్యాలు ఇలా ఎన్నో అంశాలకు సంబంధించి ప్రదర్శనల ద్వారా చక్కగా తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ మాట్లాడుతూ పురాణేతిహాసాలలోని చిన్నచిన్న పాత్రల ద్వారా ఎన్నో విలువైనవిషయాలను తెలుసుకోగలుగుతామని వివరించారు. నాటి జీవితాల్లోని ఆ బంధాలు– బంధుత్వాలు, ప్రేమలు– ఆప్యాయతలు నేడు కరువైపోయాయని అవి కేవలం పుస్తకాలలో చదవడానికి అంకితం అయ్యాయని, ఆచరణ సాధ్యం కావడానికి నోచుకోలేదని విద్యార్థులు బాల్య దశలోనే పురాణేతిహాసాల పట్ల చక్కని అవగాహనను పొంది ధర్మాధర్మాలను, నీతి న్యాయవిలువలు తెలుసుకొని మంచి నడవడికతో, పెద్దలపట్ల భయభక్తులు మర్యాదలు కలిగి బంగారు భవిష్యత్తును అందుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## గోనెగండ్ల,గంజహళ్లి ప్రధాన రహదారికి మరమ్మత్తులు చేయండి



గోనెగండ్ల, గంజహళ్లి గ్రామం మధ్య గుంతలు పడిన ఆర్‌అండ్ బీ రోడ్డు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్ల, మరియు గంజహళ్లి మధ్య ఉన్న ప్రధాన రహదారి గుంతమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగామారిందని తక్షణమే నాయకులు, ఆర్ అండ్‌బి అధికారులు రహదారికి మర్మత్తు చేయాలని గోనెగండ్ల,గంజహళ్లి గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు సమస్యను పలు మార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం కనిపించలేదని గ్రామాల ప్రజలువాపోతున్నారు. గత కొన్ని మాసాలుగా గుంతలు పడిన రోడ్డు వెంట వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.దాదాపు ఇప్పటికి ఈ రహదారి పై 20 నుంచి 30 రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. గోనెగండ్ల నుంచి గంజహళ్లికి 10 నిమిషాలలో వెళ్లే ప్రయాణం గుంతలమయం కారణంగా అరగంట పైగానే పడుతుందని వాహనదారులు తెలుపుతున్నారు. మరో 20 రోజులలో గంజహళ్లిలో బడేసాబ్ ఉరుసు జరగనుంది. రెండు రోజులు జరిగే ఈ ఉరుసుకు దాదాపు 2.50 లక్షల మంది జనం హాజరవుతారు. రోడ్డు గుంతలమయంగా ఉంటే ఉరుసుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడవచ్చునని,అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మర్మత్తు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పత్తికొండ ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన ,అభివృద్ధి కార్యక్రమాలు



**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** పత్తికొండ నియోజకవర్గంలోని క్రిష్ణగిరి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవాల కార్యక్రమాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ నిర్వహించారు.మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో రూ.7 కోట్ల 95 లక్షల నిధులతో హంద్రీనది పై బ్రిడ్జి నిర్మాణం మరియు రహదారి పనుల కోసం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.అలాగే కంబాలపాడు గ్రామంలో రూ.20.94 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజీ క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం రూ.3 కోట్ల నిధులతో కోయిలకొండ నుండి కంబాలపాడు వరకు రోడ్డు మరియు బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి ఎంపిపి డాక్టర్ కంగాటి వెంకట రామిరెడ్డి,జడ్పిటీసీ సభ్యురాలు కె.యి సుభాషిణి,పి.ఐయూ రమేష్‌కుమార్‌రెడ్డి,క్రిష్ణగిరి సొసైటీ చైర్మెన్ డి.బ్రహ్మానందరెడ్డి, కంబాలపాడు క్రిష్ణమూర్తి, పి.ఆర్.ఏ.ఈ టి.అబ్దుల్ వహీద్ సాహెబ్,



డాక్టర్ వై.ప్రదీప్,కొయిలకొండ నాయకులు గోవింరాజులు,శంకరయ్య,ఎంపిటీసీ సభ్యుడు కృష్ణయ్య, టి.గోకుల పాడు నాయకులు నిలకంఠ తిమ్మరాజు,ప్రభాకర్‌రెడ్డి ఇంకా పలు గ్రామాల నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం

**– నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష – సబ్ కలెక్టర్**



**ఆదోని, మేజర్ న్యూస్ :** సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణహత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా పిసిపిఎన్డీటి చట్టంపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ, పిసి పిఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని సబ్ కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50వేల జరిమానా నుండి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. పిసి పిఎన్డీటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25వేల లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలోని 48స్కానింగ్ ప్రతి నెలకొక్కసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్, సిబ్బంది పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనికీ చేసి నిబంధనలకు విరుద్దంగా ఉన్న స్కానింగ్ సెంటర్లను రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ శివ నారాయణ స్వామి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ మాధవిలత, మెడికల్ సూపరింటిండెంట్ ప్రమీల, డిస్టిక్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతుల
## పాఠశాల ప్రవేశ దరఖాస్తుల స్వీకరణ

**వెలుగోడుమేజర్ న్యూస్ :** రానున్న విద్యా సంవత్సరం 2024 - 25 గాను మండలంలోని వివిధ గ్రామాలలో(హెచ్ఐవి,అనాధ పిల్లలు, విభిన్న ప్రతిభావంతులై ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ, ఓసి వర్గాల పిల్లలకు తమ సమీప ప్రాంతంలోని ఐబి, సీబీఎస్సీ, ఐసిఎస్‌సి, రాష్ట్ర సిలబస్ ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతి ప్రవేశమునకు దరఖాస్తులు23-2-24నుండి 14-3 2024 వరకు స్వీకరించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాం నాయక్ తెలియజేశారు. ప్రతి పాఠశాల యందు 25% సీట్ల వరకు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. http://cse.ap. gove. In వెబ్సైట్ నందు, మరియు గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, సంబంధిత పాఠశాల నందు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేసి పాఠశాల యందు జాబితాను పొందుపరచడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్.18004258599 సంప్రదించగలరని తెలియజేశారు.

సూర్య



## కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆటోడ్రైవర్లకు కర్నూలు సెంట్రల్ లైబ్రరీలో కంటి అద్దాలను పంపిణీ చేశారు. గ్రంథాలయ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తమ కళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎల్‌జి.గంగాధర్‌గౌడ్, ఫ్రైండ్ సొసైటీ ప్రెసిడెంట్ మణి, రవాణా వాఖ అధికారి వెంకటకుమార్ పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు జగన్‌రెడ్డికి చెంపపెట్టు

### – గౌరు దంపతులు


మాట్లాడుతున్న గౌరు దంపతులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** రాజధాని ఫైల్స్ విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ప్రజా వ్యతిరేక జగన్‌రెడ్డి కుట్రలకు చెంపపెట్టు లాంటిదని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని తమ నివాసంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్లు, రికార్డులు సక్రమంగానే ఉన్నాయని కోర్టు అభిప్రాయడటం టీడీపీ ఆహ్వానిస్తుందన్నారు. జగన్ తన అంగబలంతో, అర్ధబలంతో సినిమాను అడ్డుకోవాలని చూపి విఫలమయ్యారన్నారు. చివరకు న్యాయమే గెలిచిందన్నారు. రాజధాని విషయంలో జగన్ చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఒక పాలకుడి కుట్రలతో ప్రజా రాజాని ఎలా విధ్వంసం అయిదో చూపించారన్నారు. రాజధాని ఫైల్స్ ఏమీ కల్పిత కథ కాదని, మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి తెలిసిన జగన్ విధ్వంస కథ అన్నారు. జగన్ కథ క్లైమాక్స్‌కు చేరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు.

## విద్యార్థులకు చదువుతో పాటు సభ్యత నేర్పాలి

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు చదువుతో పాటు సభ్యత సంస్కారం నేర్పాలని మాజీ అంతర్జాతీయ విశ్వహిందూపరిషత్ అధ్యక్షులు జి.రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మహానందిరోడ్డులో ఉన్న ఎయిమ్ ఫర్ సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, మోక్షేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం రాఘవరెడ్డి విద్యార్థినులతో అక్కడి పరిస్థితులను గురించి తెలుసుకుంటూ వారి అవసరాలను గురించి విచారిస్తూ వారు కోరిన మేరకు వారికి చెస్ బోర్డులు, క్యారంబోర్డులు అందించారు. అలాగే పాఠశాల బ్యాగ్‌లను కూడా అందజేశారు. వాలీబాల్ కోర్టు కావాలని కోరగా వారి కోరిక మేరకు 900అడుగుల మేరకు కాంపౌండ్‌వాల్‌ను తానే నిర్మించి ఇస్తానని తెలిపారు. ఈసందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సభ్యత, సంస్కారాలు చాలా ముఖ్యమని తమ గతాన్ని మరిచిపోకుండా తల్లిదండ్రులను గౌరవిస్తూ సమాజంలో గొప్ప వ్యక్తులుగా తయారు కావాలని కోరారు.

### పోలింగ్ కేంద్రాల్లో

## సౌకర్యాలు ఏర్పాటు చేయండి : సబ్ కలెక్టర్

ఆదోని, మేజర్ న్యూస్ : పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన మేరకు ఓటర్ల తుది జాబితాను రూపొందించామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాల్లో ఎలెక్షన్ కమీషన్ నిబంధన మేరకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లసౌకర్యం కల్పించాలని తహశీల్దార్ హసినా సుల్తాన్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి, తహశీల్దార్, ఎఈఆర్‌ఓ, డిప్యూటీ తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, ఎలెక్షన్ సీనియర్ సహాయకులు ఖాసీం, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రథసప్తమి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు


పూజలు నిర్వహిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి


పూజలు నిర్వహిస్తున్న గౌరు దంపతులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** రథసప్తమి పండుగ సందర్భంగా శుక్రవారం బాలాజీనగర్‌లోని సూర్యభగవానుడి ఆలయంలో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలు వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట వైసీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దండులక్ష్మికాంతరెడ్డి, వైసీపీ నాయకులు భీమేష్‌రెడ్డి, సత్యంరెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్ల నాగిరెడ్డి, వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.

## సేవా పురస్కారాలతో వాలంటీర్లపై బాధ్యత పెరిగింది

### – ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** సేవా పురస్కారాలతో వాలంటీర్లపై మరింత బాధ్యత పెరిగిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పొదుపు భవన్‌లో ఎంపీడీవో డి.మల్లేశ్వరి అధ్యక్షతన వాలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవా పురస్కరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ గ్రామాల్లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందాలనే ఉద్దేశ్యంతో వాలంటరీ వ్యవస్థను తీసుకవచ్చారని, వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైసీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు చైర్మన్‌ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ లోటరీబాష, ఈవోఆర్డీవ సుబ్బరాయుడు, ఓర్వకల్లు సర్పంచ్ నాగేశ్వరమ్మ, సింగిల్‌విండో చైర్మన్ నాగతిరుపాలు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి


ఎంపిడిఓ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్,ఎంపిటిసిలు

**ఆలూరు, మేజర్‌న్యూస్ః** ఆలూరు మండలంలో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మండల సర్పంచ్, ఎంపిటసిలు ఎంపిడిఓ నరేంద్రకుమార్‌ను కోరారు.శుక్రవారం ఆలూరు ఎంపిడిఓ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి ఏరూరు శేఖర్, మొలగవల్లి, హులేబీడు, ఎం.కొట్టాల తదితర గ్రామ సర్పంచులు మోహన్‌రాజ్, రాజశేఖర్, ఎంపిటిసిలు శ్రీరాములు, చిన్నాయాదవ్, రమేష్‌లు మాట్లాడుతూ వేసవి వస్తుందని ఇప్పటికే గ్రామాలలో ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీరు అందుతుందన్నారు. మండల సర్వసపభ్య సమావేశానికి ప్రతి అధికారి రావాలని ఆదేశాలు ఉన్నా చాలామంది అధికారులు డుమ్మా కొడుతున్నారని తెలిపారు.చాలా శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకుంటున్నారని ప్రజాప్రతినిధులు అడిగిన వాటికి ఎవ్రు సమాధానం ఇస్తారని వారు అన్నారు.అలాగే పశుసంవర్ధక పథకం ద్వారా ప్రతి గ్రామంలో గొర్రెలను,పశువులను అందిస్తారని సంభందిత అధికారి తెలిపారు.అలాగే గ్రామాల్లో ఇళ్లు కట్టుకోవాలంటే ఇసుక కొరత అధికంగా ఉందని కొట్టాల ఎంపిటిసి తెలిపారు.సమస్యలను విన్న ఎంపిడిఓ నరేంద్రకుమార్ నూతనంగా భద్యతలు చేపట్టామని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు చౌడారెడ్డి, మోహన్, ఎంచాయతి కార్యదర్శులు విజయ్, జిలాన్, ఈఓఆర్డీ, మండల విద్యాధికారి, వ్యవసాయ, మెటర్నిటి, రెవెన్యూ అటవీ పలు శాఖలకు చెందిన సిబ్బంది, వీరేష్, జీరాగౌడు, లక్ష్మినారాయణ, రామాంజినేయులు పాల్గొన్నారు.

### ఆలూరు టికెట్

## ఇంఛార్జి కోట్ల సుజాతమ్మకు కేటాయించాలి

### అభ్యర్థి మార్పు వల్ల ప్రతిసారి టిడిపి ఓటమి


మాట్లాడుతున్న మండల కన్వీనర్ అశోక్ యాదవ్

**ఆలూరు, మేజర్‌న్యూస్ః** ఆలూరు తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ టికెట్ టిడిపి ఇంచార్జి కోట్ల సుజాతమ్మకు కేటాయించాలని ఆలూరు మండల టిడిపి కన్వీనర్ అశోక్ యాదవ్ ,జిల్లా ఎస్సీ సెల్ నాయకులు నరసప్ప,వాల్మికి సాధికారత కన్వీనర్ భాస్కర్ నాయుడులు కోరారు. శుక్రవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్లు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కోట్ల సుజాతమ్మను ఆలూరు టిడిపి అభ్యర్థిగా ఇంతవరకు ప్రకటించకపోవడం విడ్డూరమని అన్నారు. గత స్థానిక ఎన్నికల్లో మంత్రి జయరాం అరాచకాలకు ఆలూరు నియోకవర్గంలో సర్పంచ్,ఎంపిటిసిలకు పోటీ చేసే నాదుడే కరువయ్యారని కాని కోట్ల సుజాతమ్మ చిప్పగిరి లాంటి ఫ్యాక్షన్ మండలంలో కూడా టిడిపి అభ్యర్థులను నిలబెట్టి వారు గెలిచేవరకు పోరాడారని అన్నారు.అలాగే రాష్ట్రంలో అత్యధికంగా ఎంపిటిసి,సర్పంచ్‌లతో పాటు ఎంఎల్‌సి ఎన్నికల్లో కూడా గ్రాడ్యుయేట్‌లతో అత్యధిక ఓట్లు వేయించారని అన్నారు. ఇప్పుడు నియోజకవర్గంలో కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తూ నాకే టికెట్ అంటూ పలువురు పార్టీ కష్టకాలంలో దగ్గరికి రాని వారు ఇప్పుడు ముందుకు వస్నురని గతంలో కూడా ఇంచార్జిలను కాదని ఆలూరులో ్రతి సారి కొత్తవారికి టికెట్ ఇస్తున్నారని దీనివల్ల గత 25 ఏళుల్గా టిడిపి ఓటమి చెందుతుందని అన్నారు. స్తానిక సంస్థల ఎన్నికల్లో అన్ని అత్యధిక స్థానాలను గెలిచినా ఎంఎల్‌ఏ వరకు వచ్చే సరికి ఓటమి చెందుతున్నారని ఇందుకు కారణం చంద్రబాబు ప్రతి ఎన్నికలకు అభ్యర్థిని మార్చడం వల్లనే జరుగుతుందని ఈ ఎన్నికల్లో కూడా కొత్త అభ్యర్థిని ప్రకటిస్తే బాబుకు ఓటమి చెందే మొదటి నియోజకవర్గం ఆలూరు అవుతుందని అన్నారు. కావున ఇంచార్జిగా ఉన్న కోట్ల సుజాతమ్మకు కేటాయిస్తే అత్యధిక మెజార్టితో గెలిపిస్తామని ఇప్పటికే అన్ని మండలాల టిడిపి నాయకులు,కార్యకర్తలు కోట్ల సుజాతమ్మకే మద్దతు పలికారని వారి కుటుంబానికి ఒక్క టికెట్ ఇచ్చినా ఆలూరు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే 25 ఏళ్లుగా నలిగిపోతున్నామని మరో ఐదేళ్లు ఇక్కడ టిడిపి ఎంఎల్‌ఏ లేకుంటే ఆలూరులో టిడిపికి పట్టుగతులు ఉండవని లేదనుకుంటే చంద్రబాబుకాని లోకేష్ కాని ఇక్కడి నుండి పోటీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంత్రి జయరాం విసిరిన సవాల్‌కు ధీటైన జవాబు ఇవ్వాలంటే నారా కుటుంబం ఇక్కడి నుండి పోటీ చేయాలని లేదంటే కోట్ల కుటుంబం ను బరిలో నిలపాలని వారు కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు నాగరాజు,సర్పంచ్ యల్లప్ప, గుండన్న, ఈరన్న, రాముడు, శేఖర్, ఎంపిటిసి చిన్నాయాదవ్, మహేష్, రామాంజినేయులు, రాజశేఖర్, జగన్నాథ్, లక్ష్మిపతి, యల్లప్ప, ఐకాంత్, జలంధర్, రాజు, శివ, శేకన్నలు పాల్గొన్నారు,

కార్యకర్తలు పిలిస్తే ...

# కంచం నుండైనా కదిలివస్తా

◆ వైసిపి ఇంఛార్జీ ఆదిమూలపు సతీష్

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలోని ప్రజలు వైసిపి కార్యకర్తలు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా పిలిస్తే తినే కంచం నుండైనా కదిలివస్తా అని నియోజకవర్గ ఇన్చార్జి ఆదిమూలపు సతీష్ అన్నారు. చంద్రబాబు నాయుడు పచ్చి దగాకోరని ఇటువంటి వారి వల్ల రాష్ట్ర ప్రజలు 2014 లో తెదేపా ప్రభుత్వంలో మోసపోయారని కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. స్థానిక జిడిపి కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా 4వ విడత అసరా సంబరాల కార్యక్రమంలో కోడుమూరు వైసిపి ఇన్చార్జ్ ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మధ్య దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందేటట్లు పాలన అందించారన్నారు. సంక్షేమ పథకాలను ఎక్కువగా మహిళలకే అందించారన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మధ్య దళారులు లేకుండా చంద్రబాబు మాదిరి కల్లబొల్లి మాటలు,మోసపూరిత వాగ్దానాలతో పాలన అందించలేదని కాబట్టి మరోసారి వైయస్ జగన్ ను సీఎం చేసుకుంటే మన అందరి భవిష్యత్తుతో పాటు రాష్ట్ర భవిష్యత్తు బావుంటుందని,లేదంటే ఒక 50 ఏళ్లు వెనక్కి పోతామని దీంతో అంధాకారం ఆవహిస్తుందని ఆయన స్పష్టం చేశారు.చంద్రబాబు వ్యాపారాలన్నీ పక్క రాష్ట్రంలో ఉంటే అదనంగా ఇక్కడ సీఎం పదవి కావాలని కోరుకుంటున్నారు. అలాంటి వాళ్ళు ఈ రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం అదిటీడీపీ హయాంలో జన్మభూమి కార్యకర్తలు దోచుకున్నారు. పథకాల వర్తింపు కోసం ప్రజలు అర్జీలు పెట్టుకుంటే కలెక్టర్లు సైతం జన్మ భూమి కమిటీ సభ్యులను కలవమని చెప్పేవాళ్ళు అని ఆరోపించారు. ఆరోగ్య సురక్ష పథకంతో పేదలకు ,వృద్ధులకు ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారని ఇలా జగన్ ఇంటి పెద్ద కొడుకు అయ్యారన్నారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే ఓటు వేయండి, లేదంటే వద్దు అని అడిగే దమ్మున్న నాయకుడు ఒక జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేసే జగన్ ను మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. లోకేశ్,చంద్రబాబు ప్రజలకు ఎప్పుడో దూరం అయిపోయారన్నారు. ఇవాళ విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చి,ఇంటర్నేషనల్ సిలబస్ తీసుకువచ్చి పాఠాలు చెప్పిస్తున్నారన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఐదేళ్లలో 2.5 లక్షల శాశ్వత ఉద్యోగాలు గ్రామ,వార్డు సచివాలయంలో ఇచ్చామన్నారు. 56 వేల ఉద్యోగాలను వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేశామన్నారు. వీటి విషయమై ఎవ్వరైనా, ఎక్కడైనా లంచం ఇచ్చారా..? అని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎపిఎం పుష్పాలత, కోడుమూరు ఎంపిడిఓ దివ్య, కోడుమూరు ఎంపీపీ రూతమ్మ, కోడుమూరు జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి,, కోడుమూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి,వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ రమేష్ నాయుడు, కృష్ణాపురం సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, సత్యం రెడ్డి, ఎంపీటీసీలు మక్బూల్ బాషా, శాజిత్ అలీ,రాఘవేంద్ర, హనుమంతు, మాజీ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ మాదులు, మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న, వార్డ్ మెంబర్లు విష్ణుదాస్, రవి, రాజు, హనుమంతు, కౌల్లయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు దస్తగిరి, సోమన్న, ప్రసాదు, శంకర్, వెంకటేష్, లింగమయ్య, రమేష్ నాయుడు చిన్న దుబ్బన్న, చిన్నన్న, కర్ణ, శ్రీనివాసులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





శ్రీ రాజయోగి దేవాలయంలో

## వైభవంగా 37వ ఆరాధన



**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ తుమ్మిళ్ళ వెంకటరామిరెడ్డి తాత 37వ ఆరాధన శుక్రవారం వైభవంగా జరిగింది. రాజయోగి దేవాలయంలో గురువర్యులు శ్రీ తుమ్మిళ్ళ భక్తులు ఉదయం నుండే బారులు తీరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైసీపీ ఇన్చార్జి నాయకులు ఆదిమూలపు సతీష్, జడ్పిటిసి రఘునాథ్ రెడ్డిలు శ్రీ రాజయోగిని దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ తుమ్మల వెంకటరామిరెడ్డి దేవాలయంలో ప్రత్యేకమైన పూజలు జరిపారు. ఉదయం సీతమ్మన బావి దగ్గర వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నందు శ్రీ గణపతి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శ్రీ శ్రీ నవగ్రహ దేవతలు శ్రీ కాశీ విశాలాక్షి శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి సహిత శ్రీ ఆంజనేయ స్వాముల వారికి అభిషేకంలో జరిపారు. అనంతరం శ్రీశ్రీశ్రీ తుమ్మెళ్ళ వెంకటరామిరెడ్డి తాతకు పంచామృత అభిషేకములు మహా మంగళ హారతులు జరిపారు. ఉదయం ఆదిత్య అన్నపూర్ణ హెూమం అనంతరం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. సాయంకాలం శ్రీశ్రీశ్రీ తుమ్మిళ్ల వెంకటరామిరెడ్డి విగ్రహాన్ని నూతన రథమునందు పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.

## శ్రీశైలం ప్రాజెక్టులో బంద్ సంపూర్ణం

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** రైతులపై దాడికి నిరసనగా చేపట్టిన భారత్ బంద్ శ్రీశైలం ప్రాజెక్టు సంపూర్ణంగా జరిగింది.సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా,సిపిఐ,సిపిఎం,ఐఎఫ్టియు ఏఐటీయూసీ,సిఐటియు అనుబంధ సంఘాల పిలుపుమేరకు గ్రామంలో దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బందుకు సహకరించారు. ఆయా పార్టీల నాయకులు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులపై దాడికి ఖండించారు. కార్మిక చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని, పెంచిన పెట్రోల్సరుకుల ధరలను తగ్గించాలన్నారు. భారీగా పన్నుల భారాన్ని మోటార్ రంగంపై పడిందని, ఆదివాసి గిరిజనులు దళితులపై ముస్లింలపై దాడులు ప్రత్యతంగా పెరిగాయన్నారు. రైతుల కార్మిక హక్కులను కాలు రాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నిరసన కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆశీర్వాదం, పులిరాజు, చిన్న మారెన్న, ఓబులయ్య, సాయి, అన్వర్ భాష, నాగరాజు తదితరులు ఉన్నారు.

## రైతు ద్రోహి మోది



**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** నరేంద్ర మోడీ రైతు ద్రోహి అని వామపక్షాల నాయకులు రాజు, గఫూర్ లు అన్నారు. శుక్రవారం గ్రామీణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట్ల సర్కిల్లో రాస్తారోకోను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల, కర్షకుల, రైతుల చట్టాలను నిర్వీర్యం చేసి కొత్త చట్టాలను తీసుకురావడానికి పూనుకుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని, రైతులకు రుణమాఫీ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుని కైనా నెలసరి 26 వేల రూపాయల వేతనం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు దూల భాస్కర్, నాగరాజు, రైతు సంఘం నాయకులు మద్దిలేటి,నాగరాజు ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి ఎఐటియుసి నాయకులు మద్దూరు చిన్న రాముడు, మధు అమాలి సంఘం నాయకులు బజారి సుంకన్న వెంకటస్వామి కృష్ణ సిఐటియు నాయకులు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి జగన్ ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** సంక్షేమ పథకాలతో ప్రజలు మేలు చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన సీఎం వై.ఎస్.జగన్‌కు ప్రజలు అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రి కావడానికి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. మండల పరిధిలోని మారెళ్ళ-బొందిమడుగుల గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి, మారెళ్ళ నుంచి బోయబొంతిరాళ్ళ వరకు తారు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ దేవనబండ దశరథరామిరెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, వెంకటేష్, ఎంటీసీ జల్లా సుంకన్న, సచివాలయ కన్వీనర్లు డాక్టర్ రంగారెడ్డ, ఈశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి, లింగనేనిదొడ్డి గడ్డయ్య, రామాంజి, రామక్రిష్ణ, మునిస్వామి, షేక్‌లాల్‌పీరా, నల్లగుండ్ల అశోక్, నాగరాజు, ముక్కెళ్ల చిరంజీవి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల 553వ జయంతి



నివాళులర్పిస్తున్న దృశ్యం

**కర్నూలు ఎడ్యుకేసన్, మేజర్‌న్యూస్:** శ్రీకృష్ణదేవరాయలు 553వ జయంతి వేడుకలను కర్నూలు నగరంలో కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కాపు, బలిజ సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జ రామక్రిష్ణ, గౌరవ సలహాదారు పత్తి ఓబులయ్య, బాలరాజు, సుబ్రమణ్యం, బలిజ సంఘం నగర నాయకులు ఈశ్వర్‌కుమార్ రాయల్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, రవిరాయల్, ప్రభాకర్‌రెడ్డి, పల్లంశెట్టి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ శ్రీను, డాక్టర్ ప్రతాప్, అనిమిరెడ్డి, శోభన్‌బాబు, బిఎస్.రావు, జనసేన రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# గ్రామీణ భారత్ బంద్.. దేశవ్యాప్త కార్మికుల సమ్మె విజయవంతం

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** దేశ వ్యాప్త గ్రామీణ బంద్ సందర్భంగా మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు, సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా, సిఐటియు మండల కార్యదర్శి రహమతుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ ల ఆధ్వర్యంలో మద్దిలేటి స్వామి ముఖ ద్వారం నందు శుక్రవారంరాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బేతంచర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా కనీసం నేటికీ ఏ ఒక్క రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకుండా,ఉపాధి హామీ పనులను కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరుఎత్తినట్లు వ్యవహరిస్తుందని,మరోవైపు దేశంలోని రైతులు దేశ రాజధాని నగరమైన ఢిల్లీని ముట్టడించడానికి రైతులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారం కోసం సిద్ధమైతే వారిని రాకుండా రాజధాని చుట్టూ ముళ్ళకంచలు, సిమెంట్ దిమ్మెలు,భారీకేడ్లను ఏర్పాటుచేసి డ్రోన్ల ద్వారా బాష్ప వాయువులను ప్రయోగించి శత్రుదేశం అయిన పాకిస్తాన్తో యుద్ధం చేస్తున్నట్లుగా రైతులపై యుద్ధం చేస్తున్న చేతగాని నరేంద్ర మోడీ గుళ్ళు, గోపురాలు తిరుగుకుంటూ దేశానికి అన్నం పెట్టే రైతన్న పై కర్కశంగా వ్యవహరించడం తన చేతగాని తనానికి నిదర్శనమని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీచేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం, ఏఐటియుసి, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, నాయకులు ఆశా కార్యకర్తలు, ఎర్రగుడి రాముడు, తిరుమలేష్, దస్తగిరి, పుల్లారెడ్డి, రామ తిమ్మారెడ్డి, పుష్పావతి, నాగేంద్రమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, బాలస్వామి, శ్రీకర్, కోన రామకృష్ణ, దిలీప్, ప్రదీప్, మహబూబ్, రామదాసు, కృష్ణప్ప, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.




సమ్మె నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

# గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి..

**అభివృద్ధి అంటే ఏమో చేసి చూపిస్తున్నా..**
**రూ.13 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం**



జలదుర్గంలో ఆర్థిక మంత్రి బుగ్గనను గజమాలతో సన్మానిస్తున్న వైకాపా నాయకులు

**ప్యాపిలి, మేజర్ న్యూస్ :** డోన్ నియోజకవర్గంలో గత పాలకులు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని, వైకాపా ప్రభుత్వంలో డోన్ నియోజక వర్గంలో దాదాపు రూ.2500 కోట్లతో అభివృద్ధిచేశామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గనపేర్కొన్నారు.మండలంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తున్నామని తిరిగి వైకాపా ప్రభుత్వాన్ని ఆదరించాలని మంత్రి బుగ్గన జలదుర్గం సభలో స్పష్టం చేశారు.శుక్రవారం మండలంలోని రూ.13 కోట్లతో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులకు ఆర్థిక మంత్రి బుగ్గనతో పాటు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. పీఆర్ పల్లెలో రూ. 83.14 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్ క్లినిక్, గుడిపాడు నుంచి పీఆర్ పల్లె వరకు రూ.3.4 కోట్లతో నిర్మించిన రహదారి, గుట్టలపల్లి గ్రామంలో కోటి రూపాయలతో నిర్మించిన రహదారి, రాచర్లలో రూ.3 కోట్లతో చేపట్టిన కంభగిరిస్వామి ఆలయ పునఃరుద్ధరణ పనులు, సీతమ్మతాండలో రూ. 18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బూరుగలలో రూ.1.27 కోట్లతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసాకేంద్రం, గ్రామ అంతర్గత రోడ్లు, ఊరివాకిలు పనులు, జలదుర్గం గ్రామంలో రూ. కోటితో నిర్మించిన షాదీఖానా, రూ.28 లక్షలతో గ్రంధాలయ భవనం, రూ. 2 కోట్లతో జలదుర్గం గ్రామం నుంచి బనగానపల్లె రోడ్డు వరకు నిర్మించిన పనులను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ బోరా మల్లి, రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రామచంద్ర రెడ్డి, ఆలేబాద్ బాలయ్య, మాజీ జడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు గడ్డం భువనేశ్వరరెడ్డి, రాజా మురళీ కృష్ణ, మండల కన్వీనర్ పొదొడ్డి కృష్ణమూర్తి, నేరేడుచర్ల చంద్రశేఖర్రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, పీఆర్ పల్లె ప్రేమ్ సాగర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, మల్ రెడ్డి, బూరుగల శ్యామ్ సుందర్ రెడ్డి, తులసి రెడ్డి, రాచర్ల రాంచంద్ర రెడ్డి, జలదుర్గం అబ్దుల్ రసూల్, కొండారెడ్డి, శ్రీనివాసులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# సర్వదేవతామయుడు ఆదిత్యుని స్మరణం..సర్వపాపాల హరణం

**– భానుడి జన్మదిన వేళ ఆదిత్యుడికి ఆలయాల్లో పూజలు**



రథసప్తమి పురస్కరించుకుని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



సూర్య హోమం చేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సర్వదేవతామయుడైన ఆదిత్యుని ఆరాధించడం చేత తేజస్సు, ఐశ్వర్యం, ఆరోగ్యం సమృద్ధిగా లభిస్తాయని, రథసప్తమి రోజున సూర్యోదయ స్నానంతో సప్త జన్మల పాపాలు నశించి రోగం, శోకం వంటి ఇబ్బందులు తొలగుతాయని శాస్త్ర వచనం. ఆదిత్య హృదయం స్తోత్రం స్మరణ సర్వపాపాలను హరించి వేస్తుందని శ్రీరాముడికి అగస్త్య మహాముని ఉపదేశించినట్లు రామాయణం పేర్కొంటున్నది. అంతటి శక్తివంతమైన ఆదిత్య హృదయంను ఎవరైతే నిత్యం పఠిస్తారో వారికి సర్వరోగాలతో పాటు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయని పండితులు పేర్కొంటారు. శుక్రవారం మాఘమాస శుక్లపక్షంతో కూడిన తిథి రథసప్తమి. ఈ రోజున సూర్యుడి జన్మదినంగా పిలుస్తారు. సూర్యుడి రథానికి ఉన్న ఇరుసు పగలు, రాత్రికి ప్రతీక అని, చక్రాలు ఆరు ఆకులు, రుతువులకు, ధ్వజం ధర్మానికి ప్రతీకలని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈరోజు నుంచి ఆదిత్యుని శక్తి భూమికి పుష్కలంగా వస్తుందని చెబుతారు. రథసప్తమి రోజున తెల్లవారుజామున తలపై జిల్లేడాకులు రేగాకులు పెట్టుకుని స్నానం చేయాలని ధర్మ శాస్త్రం చెబుతుంది. దీనివల్ల ఏడు జన్మల్లో చేసిన పాపములను, ఏడు రకములైన వ్యాధులను నశింప చేస్తాయని పేర్కొంటారు. ఇందులో భాగంగా పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆరుబయట సూర్యుని ఎదుట వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. సూర్య హోమంను వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి నైవేద్యంను ఆరుబయట కట్టెల పొయ్యిపై తయారు చేసి హారతులు ఇచ్చి ఆయనకు నైవేద్యంగా సమర్పించారు. సమాజ్ అధ్యక్షులు సూరయ్య దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పట్టణంలోని పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాల పై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌లు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలపై జిల్లాలోని ఎస్వీఆర్ కళాశాల, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాల, గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, పాలిటెక్నిక్ పాఠశాల, నెరవాడ గురుకుల పాఠశాల తదితర కళాశాలల జాబితా ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించి నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి శివరామిరెడ్డి, బీజేపీ పార్టీ తరపున చంద్రశేఖర్, వైయస్సార్‌సీపీ పార్టీ తరపున సూర్యనారాయణరెడ్డి, సీపీఐ పార్టీ తరపున వెంకటరమణలు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, శాంతిరాం, ఆర్‌జీఎం కళాశాలల ఓట్ల లెక్కింపు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని గుడ్‌షెప్పర్డ్, పాలిటెక్నిక్, నెరవాడ గురుకుల పాఠశాల తదితర కళాశాలలు అనుకూలంగా లేవని రాజకీయ పార్టీలు ఆక్షేపిస్తే గతంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ యూనివర్శిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించాలని అంగీకరించడంతో జిల్లాలో గుర్తించిన సంబంధిత కళాశాలల జాబితాను ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం

# పిరికిపంద చర్య

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని తెలుగుదేశం పార్టీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు బీటీనాయుడు విమర్శించారు.శుక్రవారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ సినిమాను చూస్తే జగన్‌ను ప్రజలు ఛీ కొడతారనే భయంతోనే ప్రదర్శనను అడ్డుకుంటున్నారన్నారు. రాజధానుల విషయంలో సీఎం జగన్ చేసిన కుట్రలను ఈ సినిమాలో చూపించారన్నారు.సినిమా చూపించిదంతా నిజమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమన్నారు. తెలుగుదేశం–జనసేన కూటమి విజయం తథ్యమన్నారు.



# మల్లన్నను దర్శించుకున్న దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



ఆలయ రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ శుక్రవారం వేకుజామున దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు ఈవో పెద్దిరాజు, అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా మంత్రి దంపతులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

# శ్రీశైల మల్లన్న సేవలో జగద్గురు పీఠాధిపతి



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామివారు శుక్రవారం సేవించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న పీఠాధిపతి వారికి సంప్రదాయాన్ని అనుసరించి రాజగోపురం వద్ద కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు,వేదపండితలు ఆహ్వానం పలికారు.తరువాత పీఠాధిపతి వారు శ్రీ స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో పీఠాధిపతివారికి దేవస్థానం తరుపున వస్త్ర సమర్పణ జరిపించబడింది.తదుపరి పీఠాధిపతి వారు ఆశీర్వచనాలు అందజేశారు.

# మహానంది క్షేత్రంలో ఘనంగా రథసప్తమి వేడుకలు



మహానంది క్షేత్రంలోని రథశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో ఘనంగా రథసప్తమి వేడుకలను నిర్వహించారు. శుక్రవారం ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, శాంతారామ్‌భట్, హనుమంత శర్మల వేదమంత్రాలతో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డిచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మూల విరాట్‌లైన శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు విశేష ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవంగా క్షేత్ర పరిధిలోని రథశాలకు చేరుకొని రథశాల వద్ద రథంపై వెలసిన శ్రీ సూర్యనారాయణస్వామి వారికి సూర్య జయంతిని పురస్కరించుకొని గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలు నిర్వహించి సూర్య పూజ, ఆదిత్య యంత్రారాధన, సూర్యుడికి త్రిచ పూజా విధానంలో అర్ఘ్యప్రధానం, సూర్య నమస్కారాలు ఆచరించారు. అనంతరం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తూ సకల దేవతలను రథమునకు అవాహన చేసి రథాన్ని రథశాల నుంచి బయటకు చేర్చారు. మహాశివరాత్రి పర్వదినానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవానికై నేటి నుంచి రథాన్ని సిద్ధం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లె అర్జున శర్మ, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర్ శర్మ, ఆలయ కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఆలయ ఎఇఓ మధు, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు నాగభూషనం, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రజలకు మంచి భవిష్యత్తు అందిస్తా: టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** కర్నూలు నగర ప్రజలకు మంచి భవిష్యత్తు అందించాలన్నదే తన కల అని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ఏక్యాంపు చాణిక్యపురి కాలనీ టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. ఈ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, తమ ప్రభుత్వం వస్తే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఉంటుందని తెలిపారు. కర్నూలులో తనను గెలిపిస్తే నగర రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో వల్ల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి, బాబ్జీ, చంద్రమోహన్, వినోద్‌చౌదరి, శేఖర్, విజయకుమార్, జవహర్‌బాబు, ప్రమోద్, రామక్రిష్ణ, మల్లికార్జునగౌడ్ ఆనంద్, ఎద్దుపెంట అంజి, నాగన్న, ఆనంద్, షాబానా, మణిగౌడ్, మద్దయ్య, అబ్రహం, అనిల్ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్